నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

శుక్రవారం | ఫిబ్రవరి 16, 2024 | www.navatelangana.com

బదిలీ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు

ఆసిఫాబాద్ : జిల్లా పోలీస్ శాఖ నుండి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావుతో పాటు డిసిఆర్‌బి డీఎస్పీ రమేష్, కార్యాలయ సూపరింటెండెంట్ ఎండీ.ఇంకేశవ అలీ, శ్రీనివాస్‌ను ఎస్పీ సురేష్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కడికెళ్లిన గుర్తింపు తెచ్చుకునేలా పని చేయాలన్నారు. వసుధ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కుట్టు మిషన్ల పంపిణీ, ఇతర కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో వీరి పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. అంతకుముందు ఆసిఫాబాద్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన డీఎస్పీ సదయ్య ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌బి సిఐ రాణాప్రతాప్, సిఐ ఎ, ఆర్ఐలు, ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీఓను సన్మానించిన పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-బోథ్

ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రమేష్‌ను పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఏపీవో జగదేవ్, సూపరింటెండెంట్ రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్లు శశికాంత్, ప్రమీల, పంచాయతీ కార్యదర్శులు రాకేష్, ప్రసాద్‌గౌడ్, శివకుమార్, స్వామి, అనిల్, రాజేశ్వర్, శివ, నరేష్‌చారి, రవీందర్, శ్రీకాంత్, అంజయ్య, జాదవ్ అశోక్ పాల్గొన్నారు.



సమ్మె సైరన్..!

- కేంద్ర రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగ్రహం
- నేటి గ్రామీణ భారత్ బంద్‌కు సంసిద్ధం
- జయప్రదం చేయాలని కార్మిక సంఘాల పిలుపు
- వామపక్ష, రాజకీయ పార్టీల మద్దతు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేయూ), కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా భారత్ బంద్‌కు కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. శుక్రవారం చేపట్టే ఈ బంద్‌ను జయప్రదం చేసేందుకు వివిధ కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. ఈ బంద్‌కు వామపక్ష పార్టీలైన సీపీఐ(ఎం), సీపీఐ, న్యూడెమోక్రసీ, ప్రజాపంథ తదితర పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. బంద్ సందర్భంగా చేపట్టే వివిధ కార్యక్రమాలను కార్మిక సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహన ర్యాలీలు నిర్వహించడంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించేలా సంసిద్ధమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణ, మండల కేంద్రాలకు ఆయా కార్మిక సంఘాల నాయకులు సిద్ధమయ్యారు. ఇప్పటికే సన్నాహక సభలు, సమావేశాలు, అవగాహన ర్యాలీలు నిర్వహించి జనాలను చైతన్యపర్చిన సంఘాలు పూర్తిస్థాయి కార్యాచరణకు సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



సమ్మె జయప్రదం చేయాలని బుధవారం నిర్మల్‌లో బైక్‌ర్యాలీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు కార్మిక సంఘాలు నిరసిస్తున్న విషయం తెలిసిందే. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల కారణంగా ప్రజల జీవనాదాయం పడిపోయి పేదల సంఖ్య పెరిగిపోతోందని ఆక్స్‌ఫాం నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ నివేదిక ప్రకారం దేశంలో 80కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన మగ్గిపోతున్నట్లు కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంటామని కేంద్రం రాతపూర్వకంగా హామీనిచ్చినా అమలు చేయడం లేదని వాటిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుంటోంది. ఆందోళన సందర్భంగా మరణించిన 750మంది రైతు కుటుంబాలకు పరిహారం కూడా ఇవ్వలేదు. ఉపా చట్టం పేరుతో రైతులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెడుతోందని చెబుతున్నారు. ఏటా దేశంలో 9 కోట్ల ఎకరాల్లోని పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నాయని తెలంగాణలో గత పదేండ్లలో కరువు, వరదల కారణంగా రూ.28,550కోట్ల విలువ గల పంటలు నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ఆయా వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయని చెబుతున్నారు. వీటిని నిరసిస్తూ కేంద్రానికి సెగ తగిలేలా దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ స్పష్టం చేసింది.

డిమాండ్లు ఇవే..!

కేంద్రం ముందు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పలు డిమాండ్లు వినిపించనుంది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతుల పెట్టుబడికి 50శాతం మద్దతు ధర గ్యారెంటీ చేయాలని, ఒకేసారి రుణమాఫీ చేయడంతో పాటు 60ఏండ్లు పైబడిన వారికి పెన్షన్ ఇవ్వాలని, కేంద్ర హోంమంత్రి అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని, ఫసల్‌బీమా యోజన పథకం రైతులకు ఉపయోగపడాలని, నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు, ఉపాధి పనిదినాలను 200రోజులకు పెంచాలని, పబ్లిక్ సర్వీసులను ప్రయివేటీకరించరాదని, ధరల పెరుగుదలను అరికట్టాలని స్పష్టం చేశాయి. పీడీఎస్ ద్వారా 14 రకాల వస్తువులు అందించాలని, 2006 అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, 2013 భూసేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. వీటితో పాటు పలు డిమాండ్లను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ సమ్మెను ఆయా కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదవాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదువుకొని సమాజంలో మంచి పేరు సంపాదించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవంగా భావించే శ్రీ సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింస, మత్తు పానీయాలు, ధూమపానాలకు దూరంగా ఉండాలని హితవు పలికిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని కొనియాడారు. చీకటి వెలుగులో ఉన్న బంజారా జాతిని వెలుగులోకి తెచ్చిన విప్లవ చైతన్య మూర్తిగా గిరిజనులకు ఆదర్శ ప్రాయుడయ్యాడని తెలిపారు. ఈతరం విద్యార్థులు సంత్ సేవాలాల్ మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని చదువులో బాగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ అంబాజీ, డీఈఓ, ఎంపీడీఓ, పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్ వద్ద రైల్వే కింది వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రైల్వే అండర్ బ్రిడ్జి లేక ట్రాక్ అవతలి కాలనీ వాసులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని తాంసి బస్టాండ్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండేళ్ల క్రితం రూ.98 కోట్లు మంజూరు చేశాయి. అప్పటి నుంచి పనుల కోసం టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. ఇది వరకే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఫిబ్రవరి 15 నుంచి మార్చి 31 వరకు పనులు చేపడతామని రైల్వే శాఖ అధికారులు ప్రకటించారు. దానికి అనుగుణంగా గురువారం పనులను ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రైల్వే పోలీసులు పర్యవేక్షించారు. రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రహదారిని మూసివేశారు. పనుల నిమిత్తం ఈ రూట్ నుంచి కాక సంజయ్‌నగర్ రైల్వే గేటు లేదా మహాలక్ష్మీ వాడ మీదుగా రాకపోకలు సాగించాలని కోరారు. ఇదిలా ఉంటే అటు లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తమకు సమాచారం ఇవ్వకుండా పనులు చేపడుతు రహదారిని మూసివేస్తే ఇబ్బందులు పడతామని రైల్వే అధికారులకు తెలియజేశారు. నిత్యం రెండు వందలకుపైగా లారీలు ఈ రహదారి గుండానే పీడీఎస్ బియ్యంతో పాటు ఇతర సరుకులను తీసుకెళ్తాయని తెలిపారు. అభివృద్ధికి తాము అడ్డుకాదని, ప్రత్యామ్నయ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. కోర్టు నోటీసులు వచ్చాయని, వెంటనే పనులు ఆపాలని పలువురు వ్యాపారస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ పనులు ఆపాలని తమకు ఎలాంటి నోటీసులు, ఆదేశాలు కోర్టు నుండి రాలేదని స్పష్టం చేశారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు జీవితంలో చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమైన అంశమని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. గురువారం పట్టణంలోని బ్రాహ్మణవాడలో గల మహమ్మదీయ ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలకు మార్గనిర్దేశం చేశారు. ముందుగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో గెలుపొందడం ముఖ్యం కాదని, పాల్గొనడం ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు ప్రోత్సహించే విధానంలో పిల్లలు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశం ఉండాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు క్రీడలు ఆడడం వల్ల శారీరక దృఢత్వం, మిత్రులతో కలిసి ఆటలను ఆడటం వల్ల స్నేహబంధం, టీం క్రీడలలో పాల్గొనడం, ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడం వల్ల జీవితంలో ఏదైన సాధించాలని పట్టుదల పెరుగుతుందని తెలియజేశారు. తదుపరి ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు చొప్పున ఉన్నత, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రాజేష్, పాఠశాల ప్రిన్సిపాల్ జఫర్‌ఖాన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బుడుందేవ్ జాతర పూజా కార్యక్రమంలో పాల్గొన్న సుగుణక్క



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో గురువారం బుడుందేవ్ ఆలయంలో నిర్వహించిన మహాపూజ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెస్రం వంశస్తులతో కలిసి ఆదివాసీ సంస్కృతి సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మెస్రం వంశీయుల మేళాలో పాల్గొని ప్రతి ఒక్కరిని పలకరించారు.

సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా



నవతెలంగాణ-ఉట్నూర్

బంజారా, లంబాడాల ఆద్యుడు సంత్ సేవాలాల్ అడుగు జాడల్లో నడవాలని ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా అన్నారు. గురువారం పట్టణంలోని సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాదాస్‌నగర్‌లోని జగదాంబ ఆలయంలో భోగ్ బండారో పూజా కార్యక్రమం చేసి, అనంతరం వినాయకచౌక్ నుండి జీసీసీ పెట్రోల్ బంక్ వరకు సేవాలాల్ మహారాజ్ పల్లకి శోభా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రజలు మద్యానికి బానిస కాకుండా మంచి మార్గంలో నడుచుకోవాలన్నారు. సేవాలాల్ జయంతి కమిటీ గౌరవ అధ్యక్షులు జాదవ్ వసంత్ రావు, అధ్యక్షులు రాథోడ్ మహేందర్ మాట్లాడుతూ 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లాలోని రాంజీనాయక్ తండాలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మించారని తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవం, ప్రకృతి ప్రేమికుడు, ఆధ్యాత్మిక గురువైన సేవాలాల్ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేశారని తెలిపారు. దేశంలో సుమారు 14కోట్లకు పైగా జనాభా కల్గిన బంజారా జాతిని బ్రిటిష్ వారి నుండి కాపాడిన ఘనుడు సేవాలాల్ మహారాజ్ అన్ని పేర్కొన్నారు. జేఏసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ మాట్లాడుతూ లంబాడీలు సేవాలాల్ మహారాజ్ జయంతి, తీజ్ పండుగ, హోలీ లాంటి పండుగలను ప్రతి తండాలో ఘనంగా జరుపుకోవాలని కోరారు. గొరబోలి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఫిబ్రవరి 15న ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని, తీజ్ పండుగను పాఠ్యపుస్తకంలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్ గోపాల్‌రావు, నేతావత్ రాందాస్, పవార్ విజయ్, సుధాకర్ నాయక్, గణేష్, ఈఈ భీంరావ్, యూత్ నాయకులు నరేష్, సచిన్, కార్తీక్, తరుణ్, విశాల్, రాహుల్, మహేందర్ పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంతో పాటు బొందిడి గ్రామంలో గురువారం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాథోడ్ సజన్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. ప్రతి బంజారా బిడ్డ ఆయన చరిత్ర గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా కులస్తులు పాల్గొన్నారు.

ముధోల్ : మండలంలోని చింతకుంటతండా, ఎడ్బిడ్‌తండా, విట్టొలితండా, తరోడాతండా గ్రామాలలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని బంజారా సంఘం నాయకులు, కులస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సేవాలాల్ మందిరంలో ఘనంగా భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. బంజారా కులస్తులను ఏకతాటి తీసుకువచ్చిన మహనీయుడు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని ప్రముఖులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చింతకుంట మాజీ సర్పంచ్ రాజేందర్, ఎడ్బిడ్ తండా సర్పంచ్ ధూమ్‌నాయక్, విట్టొలితండా సర్పంచ్ విజేష్, బంజారా సంఘ నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్



నవతెలంగాణ-ముధోల్

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని బ్రహ్మంగావ్, అష్ట, ఎడ్‌బిడ్ గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ సుకన్య రమేష్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. నియోజకవర్గంలో సుమారు ఏడు కోట్ల 50లక్షల వరకు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. అధికారులు సైతం పక్షపాత ధోరణితో వ్యవహరించవద్దని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలు అందే విధంగా చూడాలని కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి సత్తాచాటాలని పేర్కొన్నారు. అష్ట గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ విషయం మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, ముధోల్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, ఎంపీటీసీలు ఆత్మ స్వరూప్, సునీత పోశెట్టి, మాజీ సర్పంచులు సుకన్య రమేష్, యూత్ అధ్యక్షులు రావుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పటేల్ పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా బీసీ చైతన్య యాత్రను విజయవంతం చేయండి



నవతెలంగాణ-హాజీపూర్

మార్చి నెల 3వ తేదీ నుండి మంచిర్యాల జిల్లాలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ చైతన్య యాత్ర కొనసాగనున్నదని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంచిర్యాల బీసీ భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. మంచిర్యాలలోని అమరవీరుల స్థూపం దగ్గర నుండి బీసీ చైతన్య యాత్ర ప్రారంభం కానున్నదని తెలిపారు. ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సామాజిక న్యాయ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ ప్రారంభ సభకు ముఖ్య అతిథులుగా వస్తున్నారని తెలిపారు. జిల్లాలోని బీసీ వర్గాల వారందరిని ఐక్యపరిచి ఉద్యమాన్ని కొనసాగించడానికి బీసీ ఐక్యవేదిక పని చేస్తుదని తెలిపారు. బీసీల ఉమ్మడి సమస్యల సాధన కోసం గతంలో ఎన్నో పోరాటాలు చేపట్టామని, ఐక్యవేదికను మరింత బలోపేతం చేసుకొని హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించడానికి ముందుకు రావాలని, జిల్లాలోని బీసీ వర్గాల ప్రజలను ప్రజాస్వామిక వాదులను కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసి జనాభా లెక్కలను వెంటనే చేపట్టి, జనాభాకు అనుగుణంగా బీసి రిజర్వేషన్లు పెంచాలని, మండల్ కమిషన్ చేసిన అన్ని సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్ము రాజన్న, బీసీ నాయకులు మొగిలి లక్ష్మణ్, సోమయ్య భూమన్న, చిందం వెంకటేష్, ఆవునూరి పోచం పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి కృషి



నవతెలంగాణ-బోథ్

శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయినగర్‌లో సేవాలాల్ 285వ జయంతి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం ఆధ్యాత్మికవేత్త, సంఘ సేవకులు సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి ఒక్క బంజారా పౌరుడు సేవాలాల్ మహారాజ్, రామారావ్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. సాయినగర్‌లో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రూ.10లక్షల నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ లింబాజీ, సర్పంచులు కొడప విజయ్, సకారాం, శ్రీధర్‌రెడ్డి, న్యాయవాది పంద్రం శంకర్, ఎంపిటిసి జుగాదిరావు, నాయకులు మెడ్పెల్మ ప్రవీణ్, బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు రాథోడ్ విఠల్, సభ్యులు లింబాజీ, సకారాం, సుభాష్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ అన్నారు. గురువారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యుత్తమ శిక్షణలు అందించి క్రీడారంగాలలో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 21, 22 తేదీలలో హైదరాబాదులో జరిగే పోటీలకు ఈ జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన వారిని ఎంపిక చేసి పంపించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు క్రీడలలో విజేతలుగా నిలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న క్రీడాకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖేల్ ఇండియా సౌత్ జోన్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన అబ్దుల్ అఫియజబీన్ క్రీడాకారిణికి గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో డివైఎస్ఓ వెంకటేశ్వర్లు, డిఈఓ ప్రణీత, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక దేశవ్యాప్త సమ్మెకు టీఏజీఎస్ మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక, గిరిజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా కమిటీ సంపూర్ణ మద్దత్తు ప్రకటిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా మోడీ ప్రభుత్వ హయాంలో ఆదివాసీలపై దాడులు, అడవుల ప్రయివేటీకరణ, షెడ్యూల్ ప్రాంతాల ఎత్తివేత, అటవీ చట్టాల నిర్వీర్యం జరిగిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మెలో రాష్ట్ర వ్యాప్తంగా టీఏజీఎస్ క్యాడర్, గిరిజన ప్రజలు భాగస్వామ్యమై మోడీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-నేరడిగొండ



మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన ఏలేటి గణపతిరెడ్డి కుమార్తె వివాహం గురువారం నిర్మల్‌లోని సాగర్ కాన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహ వేడుకలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట గ్రామ బ్లాక్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, అసెంబ్లీ యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, నాయకులు రాజురెడ్డి, మోహన్‌రెడ్డి, పోశెట్టి, సుభాష్, రామ్ లఖాన్‌లు పాల్గొన్నారు.

నేటి దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాల సంపూర్ణ మద్దతు

- సమావేశంలో పాల్గొన్న వామపక్షాల నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టి, కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతాంగం పొట్టగొడుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఫిబ్రవరి 16న జాతీయ కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌కు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు వామపక్షాల నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో వామపక్షాల నాయకులు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక అదానీ, అంబానీ, టాటా, బిర్లాల ఆస్తులు ఘనణీయంగా పెరిగాయన్నారు. ప్రపంచ కుబేరుల్లో 606వ స్థానంలో ఉన్న అదానీ రెండో స్థానానికి ఎగబాకడమే ఇందుకు తాజా ఉదాహరణ అని అన్నారు. మరో పక్క దేశంలో 80 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారనీ ఐక్య రాజ్యసమితి ప్రకటించిందని తెలిపారు. నిజాలు ఇలా ఉంటే ప్రజలను మతం పేరుతో మభ్యపెట్టే కార్యక్రమాలకు పూనుకుంటుందని కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చి, వ్యవసాయ చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తెచ్చి, ఉపాధి హామీ పథకాన్ని ఎండబెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందని తెలిపారు. ఇలా దేశ ప్రజల అవసరాలను గాలికి ఒదిలేసి ఊరేగుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేలా కార్మిక వర్గం, ప్రజానీకం ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, నాయకులు బండి దత్తాత్రి, సీపీఐ పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా నాయకులు కుంటాల రాములు, సీపీఎం (ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వెంకట్ నారాయణ, మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు వినోద్ పాల్గొన్నారు.

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి డిమాండ్ చేశారు. నేడు జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. కార్మికుల ఖాతాలో ఈఎస్ఐ డబ్బులను మున్సిపల్ అధికారులు కాజేసిన రూ. కోటి 36లక్షల డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్మికుల ఇతర డిమాండ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దర్శనాల నగేష్, జిల్లా నాయకులు అడ్డూరి ఆత్మరాం, కుడిమేత శ్రీనివాస్, అజీమ్, జనార్ధన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌టౌన్ : ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్ల పరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేఖంగా దేశవ్యాప్తంగా చేపడుతున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుంచుల నారాయణ కోరారు. గ్రామాల్లోని రైతులు, రైతు కూలీలు, ఈనెల 16 జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



పెరిగిన ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్ర ప్రసార సామర్థ్యం

- ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ నౌషి నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ప్రసార సామర్థ్యం పది కిలోవాట్లకు పెరిగిందని ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ (ఇంజనీర్) మలావత్ నౌషి నాయక్ తెలిపారు. గురువారం ఆకాశవాణి కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్రం ముఖ్యకార్యక్రమాధికారి రామేశ్వర్ కేంద్రేతో కలిసి మాట్లాడారు. ఒక కిలోవాట్ ప్రసార సామర్థ్యంతో ప్రసారాలను ప్రారంభించిన ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ప్రస్తుతం పది కిలోవాట్ల సామార్థాన్ని అందిపుచ్చుకుందని అన్నారు. దీంతో ప్రసార పరిధి కూడా మరింత దూరం వరకు విస్తరించిందని తెలిపారు. ఇప్పటి వరకు మూడు కిలో వాట్ల శక్తితోనే ఎఫ్ఎం ట్రాన్స్ మిషన్ ద్వారా ప్రసారాలను సాగించిన ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ప్రసార శక్తి ప్రస్తుతం పూర్తి స్థాయి అంటే పది కిలోవాట్లకు పెరిగిందని, పది కిలోవాట్ల సామర్థ్యంతో ప్రసారాలను వినిపిస్తోందని వివరించారు. ఇందుకు కావాల్సిన 100 మీటర్ల టవర్ నిర్మాణం కూడా పూర్తయ్యిందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతటికీ, మారుమూల ప్రాంతాలకు ప్రసారాలు చేరలేని లోటు కొంతతీరిందని అన్నారు. అలాగే మొబైల్ యాప్ ప్లాట్ ఫాం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంతటనే కాకుండా ప్రపంచంలో ఎక్కడైనా ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం ప్రసారాలను వినగలిగే వీలు కలిగిందని వివరించారు. 1986 అక్టోబర్ 12 నుంచి తన ప్రసారాలతో ఆదిలాబాద్ ప్రజలను అలరిస్తూ వచ్చిన ఆదిలాబాద్ కేంద్రం 15 ఆగస్టు 2015 నుంచి ఎఫ్ఎం కేంద్రంగా మారిందని గుర్తుచేశారు. ప్రసుతం 100 మీటర్ల టవర్ నిర్మాణం పనులు కూడా పూర్తయ్యి, పది కిలోవాట్ల సామర్థ్యాన్ని అందిపుచ్చుకొని శ్రోతలకు నాణ్యమైన ప్రసారాలను అందజేస్తోందని వివరించారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టు కొరకు శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జలగం అనిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగానికి డిగ్రీ లేదా పీజీ అయిపోయిన విద్యార్థులు అర్హులని అన్నారు. ఎంపికైన వారికి ఆదిలాబాద్ పట్టణంలో పోస్టింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఏడాదికి రూ.2.6లక్షల వేతనంతో పాటు ఇన్సెంటివ్, లైఫ్ కవర్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రెస్యూమ్‌తో సర్టిఫికేట్ జీరాక్స్ కాపీలతో నేడు ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే మేళాకు హాజరుకావాలని సూచించారు.

కేసుల దర్యాప్తులో నాణ్యమైన పరిశోధన నిర్వహించాలి

- నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయస్థానాలలో నేరస్తులకు శిక్ష శాతం పెరగాలంటే కేసుల దర్యాప్తులలో నాణ్యమైన పరిశోధనా నిర్వహించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను వాటి ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసులు, రేప్ కేసులు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, మహిళలపై జరుగు నేరాలు, గంజాయి కేసులు, ప్రస్తుత కేసు ఏ స్థితిలో ఉన్నదని, అంశాలపై సుదీర్ఘంగా సిబ్బందితో చర్చించి, ఎస్పీ తగు సూచనలు చేశారు.

సాక్షాదారాలను జాగ్రత్తగా కోర్టులో హాజరుపర్చాలి..

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్క కేసులో నాణ్యమైన దర్యాప్తును నిర్వహిస్తూ సాక్షాదారాలను సేకరించి, జాగ్రత్తగా న్యాయస్థానాలలో పొందుపర్చాలని తెలిపారు. పొక్సో కేసులలో బాధితుల వివరాలు పేరు, ఊరు, తల్లిదండ్రులు, పాఠశాల లాంటి వివరాలను ఎక్కడ బహిర్గతం చేయకూడదని తెలిపారు. కీలకమైన కేసులలో ఖచ్చితమైన సాక్షాదారాలను సేకరించి నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని సూచించారు. ఎన్‌డీపీఎస్ కేసులలో నూతన పద్ధతులను అవలంబిస్తూ చార్జిషీట్లను, ఇన్వెస్టిగేషన్ నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల ప్రస్తుత పరిస్థితిని సిబ్బంది ఒక్కొక్కరిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామాలను సందర్శిస్తూ సోషల్ మీడియాలో ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల అవలంబిస్తున్న పద్ధతులను సవివరంగా వివరించి, చైతన్య పర్చాలని సూచించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లను సందర్శించినప్పుడు వెంటనే న్యాయం చేకూర్చే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. సాధారణ కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు కే.సత్యనారాయణ, ఐ.సైదారావు, డి సాయినాథ్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ టి.మురళి, నవీన్, చంద్రశేఖర్, ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ స్టేషన్ అధికారులు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, ఎస్‌బీ, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మోరు బోనానికి అష్టకష్టాలు

- గ్రామదేవత గుడి మెట్లను కూల్చేసిన బినామీ కాంట్రాక్టర్
- కట్టిస్తామని చేతులెత్తేసిన మున్సిపల్ పాలకవర్గం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

గోదావరి నదీ తీరంలో ఉన్న పంచహస్తాల పోచమ్మ ఆలయం మెట్లను బినామీ కాంట్రాక్టర్ కూల్చేయడంతో మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మోరుకు చలి బోనం సమర్పించడానికి మహిళలకు కష్టంగా మారింది. గుడి గడప వద్ద ఒకరు ఉండి, కింద నుంచి మరొకరు బోనం అందిస్తేనే అమ్మవారి దగ్గర పెట్టే పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో మహిళలు కింద పడుతున్నారు. గోదావరి తీరంలో శ్మశాన వాటికను నిర్మించిన సమయంలో ఓ బినామీ కాంట్రాక్టర్ సదరు నిర్మాణ పనులకు గాను మెటీరియల్ తరలించడం కోసం గుడి మెట్లు ఆటంకంగా ఉన్నాయని కూల్చేశాడు. శ్మశాన వాటిక నిర్మాణం పూర్తయిన వెంటనే మెట్ల నిర్మాణం చేస్తానని స్థానికులతో నమ్మబలికాడు. శ్మశాన వాటిక నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు చేతికందేదాకా మభ్యపెట్టాడు. పనులకు సంధించిన బిల్లులు చేతికందిన తర్వాత గుడి మెట్లను నిర్మించకుండా చేతులెత్తేశాడు. విషయాన్ని అప్పటి మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ కు వివరించగా తాను చొరవ తీసుకొని గుడిమెట్లను నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చినట్టు స్థానికులు తెలిపారు. హామీ ఇచ్చి రెండేండ్లు గడిచినా గుడి మెట్లను మాత్రం నిర్మించలేదు. అప్పటి నుంచి అమ్మోరుకు మొక్కులు తీర్చుకోవడం భక్తులకు ఇబ్బందిగా మారింది. మెట్లు కూల్చేసిన సదరు బినామీ కాంట్రక్టర్ తీరు పట్ల మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాఘమాసం కావడంతో ఆది, గురువారాలు చలి బోనాలు సమర్పించడానికి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. గుడి వద్ద ఏ కొంచం ఏమరపాటుగా ఉన్నా మహిళలు కిందపడే దుస్థితి నెలకొంది. గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలుగా చెప్పుకుంటున్న పలువురు నాయకులు గ్రామదేవత గుడి విషయంలో మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. గుడి మెట్లను కూల్చేసిన సదరు కాంట్రాక్టర్‌తో మెట్ల నిర్మాణం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పోచమ్మ గుడి మెట్లను నిర్మించాలి

తొంటికూరి లలిత శ్రీరాంనగర్



పోచమ్మ గుడి మెట్లను కూల్చడంతో బోనాలు సమర్పించే సమయంలో మహిళలు కింద పడుతున్నారు. గురువారం ఓమహిళా, ఇద్దరు పిల్లలు కిందపడ్డారు. మాఘమాసం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. మెట్లను కూల్చి వేయడంతో అమ్మవారికి బోనాలు పెట్టడం కష్టంగా ఉంది. మెట్లు లేక గుడి లోపలికి పోయి మొక్కుకోలేక పోతున్నాం. మున్సిపల్ పాలకులు దృష్టి సారించి మెట్లు నిర్మించాలి.

జెడ్పీ సీఈఓను కలిసిన జెడ్పీటీసీ




నవతెలంగాణ-లక్ష్మణచాంద

నూతనంగా జెడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన గోవిందయ్యను జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. మండలాభివృద్ధికి సహకరించాలని కోరారు. పచ్చని పంట పొలాలతో నిత్యం కళకళలాడే లక్ష్మణచాంద మండలాన్ని సందర్శించాలని కోరారు. జెడ్పీ సీఈఓ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, పాకాల రాంచందర్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీని ప్రక్షాళన చేయాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

బాసర ట్రిపుల్ ఐటీని ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం అసెంబ్లీలో మొట్టమొదటి సారిగా తన గళాన్ని వినిపించారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ మొదటి ప్రసంగంలోనే అవినీతిపై దుయ్యబట్టారు. ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీకి అవినీతి చెదలు పట్టిందని సభలో మాట్లాడారు. గత ఎనిమిదేండ్లుగా ఇన్‌చార్జ్ వైస్ ఛాన్స్‌లర్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అవినీతికి పాల్పడిన వీసీని తొలగించాలన్నారు. 8,700 మంది విద్యార్థులు ఉన్న ట్రిపుల్ ఐటీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. డైరెక్టర్‌కు ఎలాంటి అధికారాలు ఇవ్వకపోవడంతో పాలన కుంటుపడిందన్నారు. 18 నెలలుగా వీసీ పర్యవేక్షణ లేదన్నారు. కళాశాలలోని తరగతి గదుల్లో విద్యార్థులకు సెల్ ఫోన్‌లు అనుమతించవద్దని, ఈ నిబంధనను పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. హాస్టల్ రూమ్స్‌లో ఒక్కో రూమ్‌లో ముగ్గురు బాలికలు ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. యూనివర్సిటీలో గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. హాస్టల్లో బాత్‌రూమ్‌లు సరిగ్గా లేవని, భోజన వ్యవస్థ అధ్వాన్నంగా ఉందన్నారు. రూ.12కోట్లతో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, దీనిపై విచారణ జరపాలన్నారు. 14 ఏండ్లుగా భవనాలకు పెయింటింగ్ వేయకపోవడంతో అధ్వాన్నంగా మారిందన్నారు. అదే విధంగా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు పంపిణీ చేయాలన్నారు. గత ప్రభుత్వం బాసర ఆలయ పునర్నిర్మాణానికి రూ.50కోట్లు ఇచ్చినట్టే ఇచ్చి రూ.42 కోట్లను వెనక్కి తీసుకుందని తక్షణమే నిధులు మంజూరు చేసి ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలన్నారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు మూలంగా గుండెగాం వాసులు ఎన్నో ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పునరావాసం కింద కేవలం కాగితాలకు మాత్రమే గత ప్రభుత్వం రూ.90కోట్లు మంజూరు చేసిన ఇప్పటి వరకు బాధితులకు ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. తానూర్ మండలంలో వడగండ్ల వానతో వెయ్యికి పైగా ఎకరాల్లో నష్టం జరిగిందని, సర్వే చేయించి రైతులను పరిహారం ఇవ్వాలని కోరారు.


మండలంలో పర్యటించిన నూతన జెడ్పీ సీఈఓ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నూతనంగా నియమితులైన జెడ్పీ సీఈఓ గోవిందయ్య గురువారం మండలంలో పర్యటించారు. మొదటి సారిగా మండలానికి వచ్చిన జెడ్పీ సీఈఓను ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, ఎంపీడీఓ రాం ప్రసాద్, ఎంపీఓ నసీరుద్దీన్, ఏపీఓ ప్రమీల, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీ పరిశీలించారు. నర్సరీ సంరక్షణ గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందుల్లో వాహనదారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ నుంచి బట్టి సవర్గాం మీదుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగిల్ రోడ్డు ఉండటంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం బట్టిసవర్గాం సమీపంలో బస్సు, ఐచర్ వ్యాన్ ఇరుకు రోడ్డులో ఒకదానికొకటి తగిలి ఇరుక్కుపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎలాంటి ప్రమాదం జరుగపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి, డబుల్ రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు కోరారు.

జాతీయస్థాయిలో పథకాలు సాధించిన హోంగార్డు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫిబ్రవరి 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2024లో జిల్లా నుంచి పాల్గొన్న హోంగార్డు నలగంటి శంకర్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రెండు జాతీయ పథకాలను సాధించారు. ఈ సందర్భంగా హోంగార్డు శంకర్‌ను గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు ఆహ్వానించి, సిబ్బంది సమక్షంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం శాలువాతో సత్కరించి గెలిచిన బహుమతిని అందజేసి అభినందించారు. హెూంగార్డు శంకర్ జాతీయ స్థాయి హై జంప్ పోటీలలో 160 సెంటీమీటర్ ఎత్తును ఎగిరి రజత పథకాన్ని, ట్రిపుల్ జంప్‌లో 11 మీటర్లు దూకి కాంస్య పథకాన్ని సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పథకాలను సాధించే విధంగా తన వంతు కృషి చేస్తానని, శిక్షణకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా అంతర్జాతీయ స్థాయిలో ఈ సంవత్సరం థాయిలాండ్, మే నెలలో నిర్వహించే పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమని తెలిపారు. సిబ్బంది ఇదేవిధంగా పథకాలను సాధించినప్పుడు ప్రత్యేక అవార్డులను, రివార్డులను అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ టి.మురళి పాల్గొన్నారు.



ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-పెంబి



పెంబి నూతన ఎంపీడీఓ బాధ్యతలు స్వీకరించిన రమాకాంత్‌ను గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి బదీలిపై భైంసాకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రత్నాకర్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

18న సీఓఈ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూనియర్ కళాశాలలో అడ్మిషన్ కోసం గిరిజన గురుకులాల కాలేజి ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఎంట్రన్స్ (సీఓఈ) పరీక్షను ఈనెల 18న నిర్వహించనున్నారు. కాగా ఈ పరీక్షకు పట్టణంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో పరీక్షా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకు కేంద్రానికి చేరుకోవాలన్నారు. మధ్యాహ్నం 1 వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పరీక్ష హాల్లోకి అనుమతించబడవని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 16, 2024 | www.navatelangana.com

సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని మురళీగూడ గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని కొమురం భీం యువజన సంఘం నాయకులు కోరారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పల్లెప్రగతి ముగింపు గ్రామసభను నిర్వహించారు. సభలో ప్రత్యేక అధికారి గంగాసింగ్‌కు యువజన సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు ఉన్నాయని, పూర్తిస్థాయి అభివృద్ధి జరగలేదని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వేసవి దృష్ట్యా గ్రామంలో తాగునీటి కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్, సిర్పూర్ అధ్యక్షుడు తిరుపతి, ఆదివాసీ గోండ్వాన సంఘం అధ్యక్షుడు మధూకర్, సభ్యులు రమేష్, రాంచందర్ పాల్గొన్నారు.

ప్రపంచ అథ్లెటిక్స్‌లో జిల్లా కోచ్ ప్రతిభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రపంచ అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన కోచ్ ప్రతిభ కనబరిచారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో అథ్లెటిక్ శిక్షకు యం.విద్యాసాగర్ కేరళలోని త్రివేండ్రంలో ఎల్ఎన్‌సీపీఈలో ఈనెల 9 నుండి 15 వరకు నిర్వహించిన ప్రపంచ అథ్లెటిక్స్ లెవెల్-2 కోర్స్‌లో ప్రతిభ కనబరిచి ఏ-గ్రేడ్ అర్హత సాధించి లెవెల్-2కు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి, ఏసీఎంఓ పి.ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే.సారంగపాణి, జాయింట్ సెక్రెటరీ పి.వెంకటేశ్వర్ రెడ్డి, కుమురం భీమ్, మంచిర్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోట్నాక విజయ్, సాంబమూర్తి, సట్ల శంకర్, మారయ్య, గుండం లక్ష్మణ్, హ్యాండ్ బాల్ శిక్షకులు అరవింద్, ఖోఖో శిక్షకుల తిరుమల్ అభినందించారు.

బిల్లుల బాధ తీరేదెప్పుడో..?

బడి పిల్లలకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంట కోసం సరకులు కొనుగోలు చేయాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. మరికొందరికి చేసిన అప్పులు తీర్చలేక సరకులు కొనుగోలు చేయడం కూడా అవరోధంగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో సక్రమంగా బిల్లులు రాక అప్పులపాలైన మధ్యాహ్న భోజన నిర్వాహకులను తాజాగా కొత్త ప్రభుత్వం కూడా కనికరించడం లేదు. ఒక నెల వేతనం కొంత ఆలస్యమైతేనే కుటుంబ పోషణకు ఇబ్బందులు పడే ఈ రోజుల్లో ఏకంగా మూడు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

నవతెలంగాణ- కెరమెరి

ప్రభుత్వ పాఠశాలల్లోని పేదలకు పౌష్టికాహారం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం రోజు విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వాటికి సంబంధించి బిల్లుల చెల్లింపులో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. నెలనెలా సక్రమంగా బిల్లులు చెల్లించాల్సిన అధికారులు వీరి బాధలను పట్టించుకోవడం లేదు. రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి. వాటికి అనుగుణంగా కాకుండా పాత రెట్లతో మెనూ చార్జీలు ఇస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం పెట్టేందుకు అప్పులు తీసుకువస్తున్నారు. కుమురం భీం జిల్లాలో 816 ప్రాథమిక, 103 ప్రాథమికోన్నత, 64 ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుంది. సుమారు 45,555 మంది విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. పాఠశాలల్లోనూ కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంది. కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వం రోజుకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5.45పైసలు, ప్రాథమికోన్నత విద్యార్థులకు రూ. 8.45, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ. 10.67 చొప్పున చెల్లిస్తుంది. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో పోల్చితే ప్రభుత్వం అందిస్తున్న ఛార్జీలు ఎటూ సరిపోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజువారీ మెనూ ఇలా..!

ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెనూను ప్రకటించింది. వారంలో మూడు రోజులు గుడ్లు, మిశ్రమ కూరగాయలతో కూర, కిచిడి, పప్పు, సాంబార్లతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలి. అయితే పెరిగిన కూరగాయల ధరల కారణంగా కొత్త మెనూ ప్రకారం వంట ఏజెన్సీలు మధ్యాహ్న భోజనాన్ని అందించడం సాధ్యం కాదంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కోడిగుడ్ల ధర రూ.5 నుంచి రూ.7 వరకు ఉంది. టమాటా, మిర్చి సహా ఇతర కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. ఈ పరిస్థితులు నిర్వాహకులు ఎలా వడ్డిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలేవి..

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు సౌకర్యాలు లేక ఇబ్బందుల నడుమ వంటలు చేస్తున్నారు. ఏండ్లుగా కార్మికులు వంట షెడ్డు, గ్యాస్ సిలిండర్, ఇతర సౌకర్యాలు కల్పించాలని విన్నవిస్తున్నా ఇటు పాలకులు, అటూ అధికారులు స్పందించడం లేదు. దీని కారణంగా సమస్యల వలయంలోనే వారు వంటలు చేయాల్సిన పరిస్థితి ఉంది.

పెండింగ్‌లో బిల్లులు

విద్యార్థులకు నిత్యం భోజనం పెడుతున్న కార్మికులకు బిల్లుల చెల్లింపుల మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు రాకపోవడంతో భోజనం పెట్టడం కష్టంగా మారుతుందని వాపోతున్నారు. పాత మెనూ ప్రకారం వంట ఏజెన్సీ వారికి గౌరవ వేతనం రూ.1000 మాత్రమే ఇచ్చేది. కొత్త మెనూ ప్రకారం ప్రభుత్వం రూ.3000 గౌరవ వేతనం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన నేటికి అమలు కాలేదు.



సావర్‌ఖేడ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకులు

పౌష్టికాహారం ఎలా..?

విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు అల్పాహారంగా రాగి జావని కూడా అందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. కానీ దానికి సంబంధించి నిధులు ఇవ్వలేదు. దీంతో పాఠశాలల్లో రాగిజావ విద్యార్థులకు అందడం లేదు. గతంలో సకాలంలో బిల్లులు చెల్లించక చాలా చోట్ల వంట ఏజెన్సీలు మధ్యాహ్న భోజనం చేసేందుకు నిరాకరించాయి. పెరిగిన కూరగాయల ధరల నేపథ్యంలో బకాయిల విడుదలలో జాప్యం చేస్తే పేద విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడం ఎలా సాధ్యపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలి

ఆదే గౌరుబాయి,సావర్ ఖేడ మధ్యాహ్న భోజన నిర్వాకురాలు



మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ప్రతినెల బిల్లులను సక్రమంగా చెల్లించాలి. ప్రస్తుతం ధరలు పెరగడంతో దానికి అనుగుణంగా బిల్లులు చెల్లించాలి. కోడి గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుంది. కానీ మార్కెట్‌లో మాత్రంలో రూ.7 ఉంది. గుడ్డ ధర పెంచాలి.

పెంచిన వేతనాలు సక్రమంగా అందించాలి

కుమురం రంభ, మధ్యాహ్న కార్మికురాలు, మోడీ గ్రామం



మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం రూ.1000 ప్రభుత్వం చెల్లించేది. రూ.3000 చెల్లిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి చెల్లించలేదు. అక్టోబర్ నెల నుండి వేతనాలు రాకుండా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. పెంచిన వేతనాలు సక్రమంగా చెల్లించాలి.

గ్రంథాలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో చేపట్టిన జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ మిగులు పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో టీఎస్ ఈడబ్ల్యూఐసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, గ్రంథాలయ శాఖ అధికారులతో జిల్లా గ్రంథాలయ మిగులు పనులు, ఫర్నిచర్ ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ మిగులు పనులను త్వరగా పూర్తిచేసి ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసి గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టీఎస్‌ఈడబ్ల్యూఐసీ క్రింద చేపట్టిన పనులు, పురోగతి వివరాలపై నివేదిక రూపొందించి అందించాలని, పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈలు, డీఈలు, ఏఈలు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సభ్యులు లేక సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఒక్క ఎంపీటీసీ కూడా హాజరు కాలేదు. ప్రజ సమస్యలపై చర్చించుకు ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో కోరం లేని కారణంగా వాయిద పడింది. ఆరు శాఖల అధికారులు హాజరైనప్పటికీ ఎంపీటీసీ సభ్యులు లేనందున సర్వసభ్య సమావేశం కొనసాగలేదు. ప్రజాప్రతినిధుల తీరుపై స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇందులో తహసీల్దార్ నస్యూర్ అలీ, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఏపీఎం ముక్తేశ్వర్, ఏపీఓ పూర్ణిమ, పశు వైద్యాధికారి శ్రీకాంత్, అటవీ శాఖ అధికారి ప్రభాకర్, ఐటీడీఏ అధికారి పోశానీ, ఏఈఓ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ ఎంపీడీఓగా రమేష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 4 నెలలుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ గౌడ్ మంచిర్యాల జిల్లా జైపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బదిలీపై వెళ్లారు. పెద్దపెల్లి జిల్లా మంథని ఎంపీడీఓగా పనిచేసిన బి. రమేష్ బదిలీపై వచ్చారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సత్యనారాయణ గౌడ్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బి. గౌరీశంకర్, కార్యాలయ సూపరిండెంట్ రజియోద్దీన్, సీనియర్ అసిస్టెంట్ జమున భాయి, సిబ్బంది వసంత్, శైలజ పాల్గొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన గురుకులాలలో ఇంటర్ ప్రవేశం కోసం నిర్వహించే సీఓఈ సెట్ 2024 రాసే విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆసిఫాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల కళాశాల ప్రిన్సిపల్ అనిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఎస్‌బీ క్వార్టర్లను త్వరగా ఖాళీ చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో ఎస్‌బీ క్వార్టర్లలో అక్రమంగా నివాసముంటున్న వారు త్వరగా ఖాళీ చేయాలని పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని పలు డిపార్టుమెంట్, గనుల్లో సుమారు వంద మంది ఉద్యోగులు, 47 మంది జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో చేరారని, వారి కోసం సింగరేణి క్వార్టర్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. సింగరేణి క్వార్టర్లలో అక్రమంగా నివాసముంటున్న వారు గతంలో లిఖితపూర్వక స్లిప్పులు అందజేయడం జరిగిందని, ఈ ప్రకటన వెలువడిన రెండు వారాల్లో క్వార్టర్లు ఖాళీ చేసి యాజమాన్యానికి అప్పగించాల్సిందిగా ఆయన కోరారు. లేనిఎడల సింగరేణి యాజమాన్యం నిబంధనల ప్రకారం క్వార్టర్లను స్వాధీనం చేసుకుంటుందన్నారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిర్పూర్(టీ) మండలంలోని హుడ్కిలి గ్రామ పంచాయితీకి అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శి కాకుండా రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరుతూ గ్రామ పంచాయితీకి చెందిన కిర్మరే తరుణ్, తాడే రాకేష్ కోరారు. గురువారం కలెక్టర్ బోర్కడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయితీలో ప్రస్తుతం ఉన్న ఇన్‌ఛార్జి కార్యదర్శి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.

పొలాల్లో విద్యుత్ తీగలు వేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంటలకు రక్షణగా, అడవి జంతువులను వేటాడడానికి పంట పొలాల్లో విద్యుత్ తీగల అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ సతీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ తీగలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చిన వారిపై శిక్షార్హులని, దాదాపు పదేండ్ల వరకు కఠిన కారాగార శిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశముందన్నారు. ఎవరికైనా అక్రమంగా కరెంటు వైర్‌లు పెట్టే వారి సమాచారం తెలిస్తే సీఐ 8712670506, ఎస్ఐ 8712670567లకు లేదా పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

రేపే గృహజ్యోతి పథకానికి చివరి తేదీ

నవతెలంగాణ-వాంకిడి

గృహజ్యోతి పథకానికి ఈ నెల 17వ తేదీ చివరి తేదీ అని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం నమోదు కోసం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ప్రజాపాలన రశీదు, సెల్‌నెంబర్ తీసుకొని విద్యుత్ శాఖ కార్యాలయానికి వచ్చి విద్యుత్ సర్వీస్ నెంబర్‌కు జతచేసుకోవాలని సూచించారు. ఇంటి వద్దకు విద్యుత్ సిబ్బంది వచ్చి సమాచారం తీసుకొని ఉంటే వినియోగదారులు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, సమాచారం ఇవ్వని వారు కార్యాలయానికి వచ్చి గృహజ్యోతి పథకం నమోదు చేసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొన్నారు.

నేటి సమ్మెతో కేంద్రం కండ్లు తెరవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ నేడు నిర్వహించ తలపెట్టిన బందును విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వం కండ్లు తెరిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న వాగ్దానాన్ని గాలికి వదిలేసిందని, రైతాంగం కోరుతున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలో హామిని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని కల్పించే ఉపాధి చట్టాన్ని నీరుగారుస్తోందని, కార్మిక చట్టాలను బలహీనం చేసేలా నాలుగు రకాల లేబర్ కోడ్‌లను సిద్ధం చేసి కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు తెచ్చిందన్నారు. ఇలా దేశంలోని బడుగు బలహీన వర్గాల దోపిడీకి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లతో కలిసి పూనుకుందని ఆరోపించారు. వీటిని ఎండగట్టేల నేటి గ్రామీణ బంద్, సమ్మె ఉండాలన్నారు. కార్మిక కర్షక వర్గాలు కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యుడు గోడిసెల కార్తీక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న

యువత లక్ష్యాలు నిర్ధేశించుకోవాలి



నవతెలంగాణ-బెజ్జూరు

యువత క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుంటూ క్రీడల్లో రాణిస్తూనే అదే స్ఫూర్తితో జీవిత లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలో స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. గ్రామీణ క్రీడారుల కోసం అన్ని వసతులతో కూడిన క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించాలంటే ప్రభుత్వం ప్రతి మండలకేంద్రంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించి శారీరక మానసిక ఆరోగ్యానికి అవసరమన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలతో పాటు మెమొంటోలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సిడాం గణపతి, దుర్గం ప్రవీణ్, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, సిద్దాపూర్ సర్పంచ్ పి.రవి, పార్టీ నాయకులు జాడి శ్యాంరావు, రాంప్రసాద్, ఖ్వాజాబాయి, విజయనిర్మల, సిడం జ్యోతి, దుర్గం వెంకటేష్, తెలంగాణ జావిద్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : డీడీసీసీ అధ్యక్షుడు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాంగ్రెస్ రైతుల సంక్షేమం కోసం కనీస మద్దతు ధర, రుణమాఫీ, అలాగే ఇతర వ్యవసాయ సంస్థలకు చట్టపరమైన సిఫారసులను అమలుచేయడంలో సిద్ధంగా ఉందని, రైతులే దేశానికి పట్టుకొమ్మలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కస్తూరి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలకేంద్రంలో తెలంగాణ కిసాన్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి పిలుపు మేరకు మండలకేంద్రంలో రైతులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడో యాత్రలో భాగంగా మాట్లాడుతూ బీజేపీ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా, మద్దతు ధర కల్పించకుండా రైతులను మోసం చేసిందన్నారు. రైతులకు న్యాయం చేయకుండా మోసపూరిత మాటలు చెప్పి ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వామినాథన్ చేసిన సిఫారసులను అమలుచేయడానికి సిద్ధంగా ఉందన్నారు. అనంతరం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షెకిల్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలుచేస్తామని, అలాగే కాంగ్రెస్ కేంద్రంలో అధికారం వచ్చిన వెంటనే రైతుల సంక్షేమం కోసం వారిని అన్ని రకాలుగా ఆదుకోవడానికి ముందుంటుందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం చేపట్టడానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు లెండుగురె శంకర్, కౌటాల మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు హన్మంతు, వినాయత్ అలీ, ముకీద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి బావి పూడ్చివేతపై ఆందోళన



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని గన్నారం గ్రామ పంచాయతీ కేంద్రంలోని కుమ్మరివాడలోని ప్రభుత్వ తాగునీటి బావిని స్థానికుడు పెద్దపల్లి సత్తయ్య పూడ్చివేయడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీవాసులు గురువారం ఆందోళన బాట పట్టారు. బావిని పూడ్చివేసి చుట్టు కంచె ఏర్పాటు చేసుకున్న సత్తయ్యపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గురువారం ఖాళీ బిందెలతో మహిళలు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మంచినీటి బావిని పూడ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూలీ పనులతో జీవనం సాగిస్తున్న తాము తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురొంటున్నామన్నారు. ఈ సమస్యను సకాలంలో పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు జి.లక్ష్మి, అనిత, ఎర్ర అనిత, మానస, అమృత, సత్తయ్య, ఎర్ర సతీష్ పాల్గొన్నాడు.

ఎన్నికల్లో ప్రత్యేక బృందాల పాత్ర కీలకం

- కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసే వీడియో, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సహాయ వ్యయ పరిశీలకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ప్రత్యేక బృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, బదిలీల వారిగా విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, గత శాసనసభ ఎన్నికలలో విధులు నిర్వహించిన వారు ఎవరైనా బదిలీపై వెళితే వారి స్థానంలో ఇతరులను నియమించాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని, సరైన ఆధారాలు లేని డబ్బులు, ఆభరణాలు, కానుకలను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచి పంచనామా ప్రక్రియ పూర్తయిన తర్వాత అప్పగించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని వీడియో చిత్రీకరణ చేస్తామని, తనిఖీల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇతరత్రా ప్రచార సంబంధిత అంశాలపై దృష్టి సారించి వీడియో చిత్రీకరణ చేసి వ్యయ పరిశీలకులకు వివరాలు అందించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో కంట్రోల్ రూమ్, సి-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్

పది విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన

నవతెలంగాణ-కౌటాల

పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన మండలకేంద్రంలోని ఇన్ఫంట్ జీసెస్ ఉన్నత పాఠశాలలో టీం లీడర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంతర్గత మార్కులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు 80 మార్కులకు రాయగా 20 మార్కులు నిర్మాణాత్మక మూల్యంకనం, ప్రాజెక్టు పని, ఇంటి పని, లఘు పరీక్ష నాలుగు అంశాలను పరిశీలించి ఆ పాఠశాల హెచ్ఎం తోమ్ థోమస్‌కు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. వారి వెంట టీం సభ్యులు రాంచందర్, ఎం శ్యాంరావు, పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.వెంకటేశ్వర్లు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వెంకటేశ్వర్లు గతంలో నేరేడుచర్ల మున్సిపాలిటీలో పనిచేసిన అనుభవంతో మందమర్రికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుమతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యాంసుందర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, ఇతర విభాగాల అధికారులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

19న వేలాలలో బహిరంగ వేలం పాటలు

నవతెలంగాణ-జైపూర్



మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 19న బహిరంగ వేలం పాటలు నిర్వహించుటకు గ్రామస్థులతో కలిసి అధికారులు తీర్మానించారు. గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై ఉపేందర్, ఎంపీఓ అనిల్ కుమార్ పంచాయతి కార్యదర్శి రాకేష్‌తో పాటు గ్రామస్థులు గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా వాహణాల రాకపోకలు, పార్కింగ్ ఏరియాను ఎస్సై ఉపేందర్ పరిశీలించారు. వాహణాల పార్కింగ్‌తో పాటు కొబ్బరికాయలు, బోల్ పేలాలు విక్రయించుటుకు వేలం పాటలు నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆసక్తి గల వారు సకాంలో హాజరు కావాలని కోరారు.

సమ్మె ద్వారా కార్మికవర్గం ఐక్యతను చాటాలి



రామకృష్ణాపూర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని కార్మికవర్గ ఐక్యతను చాటాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఆర్కే సీహెచ్ గనిపై సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ పలు పరిశ్రమలలో పనిచేస్తున్న పర్మినెంట్ కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు, సింగరేణి కార్మికులు బొగ్గు రంగంలో జరుగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్కరోజు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో సింగరేణి కేటాయించే గనులను వేలం పాటలు వేస్తున్నారని, ఇప్పుడు నడిచే బొగ్గు బావులను కోల్ ఇండియాలో వేలం పాటలు వేయడం జరుగుతుందని అన్నారు. సీఎంపీఫ్‌ను 10 శాతానికి లేదా పూర్తిగా తగ్గించే కుట్రలు చేస్తున్నారని అన్నారు. సమ్మె హక్కు సైతం కార్మిక వర్గానికి లేకుండా చేస్తున్న విధానాలను బొగ్గు గనుల వేలం పాటలను సమ్మె చేసి తిప్పి కొట్టాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. కొన్ని సంఘాలు సమ్మె నోటీసు ఇవ్వడంలో చూపిన శ్రద్ధ సమ్మె చేయమని చెప్పడానికి వెనకాడుతున్నారని అన్నారు. నేడు స్వచ్ఛందంగా విధులను బహిష్కరించి దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరితో పాటు బొగ్గు గని కార్మికులు కూడా సమ్మెతో ఐక్యతను చాటాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకట స్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్ పాల్గొన్నారు.

జైపూర్ : శుక్రవారం ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ విజయవందం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం చెన్నూర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ కార్పోరేట్ మతతత్వ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని అన్నారు. ప్రభుత్వాలు కార్మికులకు అనుకూలంగా చట్టాలు తీసుకురావాలని అన్నారు. అలాంటప్పుడే కార్మిక వర్గం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. కానీ కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్లకు అనుకూలంగా చట్టాలు తీసుకువచ్చి కార్మికులను మరింత పేదరికంలో నెట్టే ప్రయత్నం చేస్తుందని ఆవేధన వ్యక్తం చేశారు. పేదల కొనుగోలు శక్తి పెరిగినప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని దీన్ని అడ్డుకోవడం కోసం కార్మిక వర్గం అంతా కలిసిరావాలని అన్నారు. ఈ క్రమంలో చేపట్టిన సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ భారత్ బంద్ విజయవంతానికి వివిధ రంగాల కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువకులు, వివిధ కుల వృత్తుల వారు, సంఘాలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య కార్మిక సంఘాల నాయకులు మాసాని రమేష్, ఐఎఫ్టీయూ నాయకులు జిమిడి కుమార్, సీఐటీయూ నాయకులు శంకర్, సీపీఐ నాయకులు తిరుపతి, ఐఎఫ్టీయూ నాయకులు పాల్గొన్నారు.



జైపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఐక్య సంఘాల నాయకులు

ఎంపీడీఓగా రాధ రాథోడ్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-జైపూర్

భీమారం ఎంపీడీఓగా రాధ రాథోడ్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. దీనికి ముందు బజార్‌హత్నూర్ ఎంపీడీఓగా ఆమె పని చేశారు. ఇక్కడి ఎంపీడీఓ శ్రీనివాస్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెల్లగా స్థానంలో ఎంపీడీఓగా రాధ రాథోడ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది ఆమెకు స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛంతో పాటు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మల్లిఖార్జున్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-జన్నారం

నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ సురేఖ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలన్నారు. నాసిరకం మందులు ఎరువులు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి షాపు నిర్వాకుడు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏఓ సంగీత, ఏఈఓలు త్రిసంధ్య అక్రమ్, సాయి, దివ్య పాల్గొన్నరు.

ఉచిత విద్యుత్ దరఖాస్తుల పరిశీలన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో స్థానిక శ్రీనివాస్‌నగర్, పలువార్డుల్లో గురువారం విద్యుత్ ఏఈ జయకృష్ణ 200 యూనిట్స్ ఉచిత కరెంటు అమలులో భాగంగా ఇంటింటికి వెళ్లి వారి విద్యుత్ వివరాలతో పాటు ప్రజా పాలన దరఖాస్తులను నమోదు, దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీలు అమలులో భాగంగా నిరుపేద కుటుంబాలకు అందించే 200 యూనిట్స్ ఉచిత కరెంటు కోసం ప్రతి ఇంటికి మా సిబ్బంది వచ్చి వివరాలు సేకరించి నమోదు చేసుకుంటున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు మా సిబ్బందికి సహకరించి, వివరాలను నమోదు చేసుకోని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ దమనకాండను ఖండించాలి

నవతెలంగాణ-జైపూర్

రైతుల ఆందోళనను అడ్డుకునేందుకు బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న దమనకాండను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం అధ్యక్షుడు గుండు తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు నిర్వహించ తలపెట్టిన ర్యాలీను బీజేపీ ప్రభుత్వం కట్టడి చేస్తుండటం బాధాకరమని అన్నారు. రైతుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ తీరును వ్యతిరేకించాలని కోరారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని చేపట్టిన రైతుల ఆందోళనను పోలీసులతో ఆపడం కోసం చేస్తున్న ప్రయత్నాలను రైతులు, రైతు కూలీలు, ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఢిల్లీకి రాకుండా నిలువరించేందుకు రోడ్లపై కాంక్రీటు నిర్మాణాలు, ముళ్ల కంచెలు, కాంటైనర్ల మోహరించడం శోచనీయమని పేర్కొన్నారు. ఇలాంటి పాశవిక చర్యలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటి సూచించిన విధంగా రైతుల హక్కులు అమలుపర్చాలని, పండించిన ధాన్యంకు మద్దతు ధర చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

'పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి'



నవతెలంగాణ-జన్నారం

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ అన్నారు. గురువారం జన్నారం గ్రామపంచాయతీలో పారిశుధ్య వారోత్సవాల ముగింపు సందర్భంగా కార్మికులను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయంటే దానికి కార్మికుల కృషి ఎంతో ఉంటుందన్నారు. వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. అలాగే మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో గ్రామ శుద్ధ కార్మికులతో ఎంపీటీసీ సాగే శ్రావణి విక్రమ్, మాజీ సర్పంచ్ కంటెం సునీత శంకర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు లేకపోతే గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి, గ్రామమంతా కంపు కొడుతుందన్నారు. వారి సేవలు మరువలేనివని కొనియాడారు. పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు.

కేజీబీవీలో వసతి సౌకర్యాలను పర్యవేక్షించిన తహసీల్దార్

నవతెలంగాణ-తాండూర్

తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తన రెండవ రోజు కార్యనిర్వహణలో భాగంగా గురువారం తాండూర్ కస్తూర్బా విద్యాలయంలో వసతి సౌకర్యాలను పరిశీలించారు. కేజీబీవీ పాఠశాలలోని బియ్యం, కూరగాయల నిల్వలను నాణ్యతను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. గత నెల రోజులుగా పిల్లలకు కోడిగుడ్లను మెనూ ప్రకారం భోజనంలో వడ్డించడం లేదని తెలుసుకొని కాంట్రాక్టర్ను ఫోన్ ద్వారా సంప్రదించారు. సమస్యను జిల్లా విద్యాధికారికి దృష్టికి తీసుకువెళ్లినట్టు పేరొన్నారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలు అవసరం ఉండగా విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడం 2 టాయిలెట్స్‌కు డోర్లు లేకపోవడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం విద్యా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని బోధన సిబ్బందికి తెలిపారు ఆయన వెంట ఇన్‌ఛార్జి స్పెషల్ ఆఫీసర్ సుమన చైతన్య ఉన్నారు.

ఎంపీడీఓగా కె.సరోజ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట ఎంపీడీఓగా కె.సరోజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన నాగేశ్వర్‌రెడ్డి అదిలాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో, నిర్మల్ జిల్లాకు చెందిన కె.సరోజ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మండలాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీడీఓ ఆఫీస్ సిబ్బంది సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అచలాపూర్ విద్యార్థులు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అచలాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న హర్షిత, ఎస్మితలు రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికయ్యారు. అచలాపూర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హర్షిత పాటల పోటీలలో, ఏడవ తరగతి చదువుతున్న ఏస్మిత ఉపన్యాస పోటీలలో జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి సాధించి సోమవారం మంచిర్యాల సైన్స్ సెంటర్‌లో జరిగినటువంటి జిల్లా స్థాయి పాటల పోటీలలో హర్షిత, జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలలో ఏస్మిత పాల్గొని బహుమతులను పొందారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన హర్షిత పాటల పోటీలో మొదటి బహుమతి ఉపన్యాస పోటీల్లో ఎస్మిత ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎదిగేందుకు దోహదపడిన శ్రీనివాస్ మ్యూజిక్ టీచర్ శ్రీనివాస్‌లను గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందించారు. రానున్న రోజుల్లో అచలాపూర్ పాఠశాల నుంచి మరింత మంది ప్రతిభా గల విద్యార్థులను ఎంపిక పోటీలకు పంపించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు జయప్రకాశ్ తెలిపారు.

నేటితో గృహజ్యోతి సర్వే పూర్తి

నవతెలంగాణ-జైపూర్

ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి పథకం సర్వే శుక్రవారంతో ముగుస్తుందని టీఎస్ ట్రాన్స్‌కో భీమారం ఏఈ కుమారస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే చాల వరకు సర్వే పూర్తి చేసినప్పటికి ఏదేని కారణాల వలన అందుబాటులో లేనటువంటి వారు శుక్రవారం గ్రామ పంచాయతి కార్యాలయం వద్దకు వచ్చి వివరాలు అందించాలని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కోసం ధరఖాస్తు చేసుకున్న వారు ఆధార్ కార్డు, విద్యుత్ మీటర్ కనెక్షన్ నెంబర్, రేషన్‌కార్డుతో పాటు ఫోన్ నెంబర్ వివరాలు తెలుపాల్సి ఉంటుందని అన్నారు. సర్వే కోసం సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద గురువారం మంచిర్యాల జిల్లా కార్మికశాఖ అధ్వర్యంలో సీఎస్‌సీ ఆరోగ్యం సంస్థ సహకారంతో యువశక్తి యూత్ ఆధ్వర్యంలో లేబర్ కార్డ్ ఉన్నా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిభిరములో దాదపు 30-40 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చెయ్యడం జరిగిందన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి వారికి ఉచితంగా మందులు గోలీలను అందించడం జరిగిందని హెల్త్ కేర్ మంచిర్యాల జిల్లా సమన్యాయకర్త కొండలరావు తెలిపారు. సిబ్బంది సుగుణ, దినేష్, సుమలత, పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరానికి సహకరించిన పొన్కల్ యువశక్తి యూత్ అధ్యక్షుడు మద్రిపల్లి శేఖర్, సభ్యులు అంజయ్య, రఫిక్, రవి, సురేష్, రాజన్న శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో వీడ్కోలు సభ

నవతెలంగాణ-హాజీపూర్



హాజీపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. గురువారం మండలంలోని పదవీకాలం పూర్తిచేసుకున్న సర్పంచులను, బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓను ఎంపీపీ మందపల్లి స్వర్ణలత-శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి సన్మానించారు. అంతకు ముందు బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ మహ్మద్ అబ్దుల్‌హై పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. సర్పంచులు తమ పదవీకాలంలో అనుభవాలను సభలో పంచుకున్నారు. ఈ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, తన పద వీకాలంలో మండలాభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. కరోనా కష్టకాలంలోనూ మండలంలోని గ్రామ పంచాయతీల్లో తిరిగి పల్లె ప్రకృతి పనులకు కృషి చేశారని అన్నారు. సర్పంచులకి పదవి విరమణ తప్పా ప్రజా సేవకు కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన ఎంపీడీఓ మధుసూదన్, మండల వ్యవసాయ అధికారిణి మార్గం రజిత, మండల పశు వైద్య అధికారిణి డాక్టర్ సరిత, ఉపాధి హామీ ఏపీఓ మల్లయ్య, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సుపరింటెండెంట్ భాగ్యలక్ష్మి మిషన్ భగీరథ ఏఈ గిరిజ, ఎంపీటీసీలు జాడి వెంకటేష్, ఒడ్డె బాలరాజు, సొగల సుజాత, అనుభాయి, కోఆప్షన్ ఎండీ రఫీక్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నయీమ్ పాషా పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌పై అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీకి చెందిన కంది శ్రీనివాస్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. జైనథ్ మండల పరిధిలో ఇటీవల జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని పేర్కొంటూ గురువారం అదనపు కలెక్టర్ శ్యామలకు వినతిపత్రం అందించారు. ఎటువంటి పదవి లేకుండానే అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధి కానప్పటికీ అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకుడు సర్పన్ లింగారెడ్డి, ఎంపిటిసి భోజన్న, రమేష్, కేశవ్, శివప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

తాండూర్ : మండలంలోని అచ్చులాపూర్ జీపీ ప్రత్యేక అధికారి తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పంచాయితీలో ఉపాధి హామీ నిధులతో మంజూరైన రోడ్డు స్లాబ్ కల్వర్ట్ నిర్మాణం పనులను గురువారం ప్రారంభించారు. రోడ్డు స్లాబ్ కల్వర్టు పనులకు గాను రూ.16 లక్షల నిధులు మంజూరు అయినట్టు తెలిపారు. అచలాపూర్‌లోని కొత్తచెరువు హనుమాన్‌నగర్ లోని రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రవీందర్‌రావు మాజీ మార్కెటింగ్ చైర్మన్ మురళీధర్‌రావు, మాజీ సర్పంచ్ శంకరమ్మ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాములు

నవతెలంగాణ-ముధోల్

ఎంపీడీవో బి.రాములు గురువారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోల బదిలీలో భాగంగా ఇక్కడ విధులు నిర్వర్తించిన సురేష్ బాబు బదిలీపై నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో బదిలీపై నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి నుండి బి.రాములు వచ్చారు. ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్, ఏపీఓ శిరీష, ఎంపీఓ అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు ఆయనను సన్మానించారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)



రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎంపీడీఓ అధికారుల బదిలీలో భాగంగా జైపూర్ మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై సిర్పూర్ మండలానికి పి.సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ రాజేశ్వర్ మందమర్రి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. అలాగే ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహించిన మహేందర్‌రెడ్డి కౌటాల మండలానికి బదిలీ కాగా నూతన ఎంపీఓగా సిర్పూర్ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణమూర్తి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం గ్రామస్తులు, అధికారులు సహకరించాలని, ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలకు చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-బోథ్



బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఓ రమేష్‌ను గురువారం యువజన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడాల అనీష్‌కుమార్, మండల అధ్యక్షుడు అరుణ్‌రెడ్డి, నేరడిగొండ మండల అధ్యక్షుడు ఈర్ల శ్రీకాంత్, యువ నాయకులు మద్దెల మహేష్, పరుశురామ్, బొక్రె సాయినాథ్, రవికాంత్, దొండిబ, రాజు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-బెజ్జూరు

వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యతని ఎఫ్ఎస్ఓ మల్లికార్జున్, ఎఫ్‌బీఓ వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులకు ఎవరైనా హాని కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వేసవిలో అడవికి వెళ్లే వారు అగ్ని ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. అలాగే ముత్తడి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు తిరుగుతున్నందున పశువులపై దాడి చేస్తే వెంటనే సమాచారం అందించాలని, వారికి నష్టపరిహారం అందేలా చర్యలు చేపడుతామని సూచించారు. సమావేశంలో రమేష్, కృష్ణ, శంకర్, గోపాల్, మొండి తిరుపతి, బాపు, రవి, భీమన్న, హన్మంతు, బక్కన్న పాల్గొన్నారు.

అన్నావదినను చంపిన తమ్ముడు

నవతెలంగాణ-వాంకిడి

సొంత తమ్ముడే అన్నావదినెను హత్య చేసిన సంఘటన మండలంలోని కమాన గ్రామంలో సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. డోంగ్రి పత్రు తన అన్నావదిన డోంగ్రి దస్రు, డోంగ్రి బైనాబాయిని దారుణంగా హత్య చేశారు. దస్రు, బైనాబాయి పోలం పనులు చేసుకుండగా అక్కడి వచ్చిన పత్రు కొడ్డలితో నరికాడు. గమనించిన పక్క చెనులోని రైతులు అక్కడికి నుంచి పత్రు పరాయ్యడని తెలిసింది. విషయం తెలుసుకున్న ఎస్సై సాగర్ సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. ఈ సంఘటకు భూ తగాదాలే కారణమా..? లేక ఇతర కారణాలు ఎవైన ఉన్నాయ అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతులకు ముగ్గురు పిల్లలు బయ, కవిత, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు చేసిన కార్మికులకు సన్మానం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామపంచాయతీలో ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేసిన కార్మికులను పంచాయతీ కార్యదర్శి స్వామి ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామ పంచాయతీలోని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. సకాలంలో పనులు పూర్తి చేసిన కార్మికులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెట్లపల్లి సదానందం, బిల్ కలెక్టర్ అజరుద్దీన్, మాజీ ఉపసర్పంచ్ రామాయి గంగామణి, మాజీ వార్డు సభ్యులు కల్పన, భోజరాజ్, నాయకులు రామయి శంకర్, సోమన్న, మోహన్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ



నవతెలంగాణ-ఖానాపూర్

16న గ్రామీణ భారత్ బంద్ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఖానాపూర్ పట్టణంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం, ఐఎఫ్టియూ, సీఐటీయూ, ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నందిరామయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుంచుల నారాయణ, ఐఎఫ్టియూ జిల్లా కార్యదర్శి సునారికారి రాజేష్, జిల్లా నాయకులు దుర్గం లింగన్న, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు వోడ్లగట్ల శంకర్, కుంచపు ఎల్లయ్య, వర్మ, సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఖానాపూర్ మండల అధ్యక్షులు శేఖర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాధర్‌లు పాల్గొన్నారు.

డీపీఆర్వో విష్ణువర్ధన్ బదిలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిర్మల్ జిల్లా డీపీఆర్వోగా పనిచేస్తున్న తిరుమలను ఆదిలాబాద్‌కు నియమించారు. ఈ మేరకు సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగాయి.

ఆదిలాబాద్ డీఎస్పీగా జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ నూతన డీఎస్పీగా ఎల్.జీవన్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన హుజురాబాద్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ డీఎస్పీగా ఉన్న వి.ఉమేందర్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

నేటి సమ్మె, గ్రామీణ బంద్‌లో కార్మికులు పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం గ్రామీణ బంద్ సమ్మెకు సర్వం సిద్ధమైనట్లు వివిధ కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమ్మెలో కార్మిక కర్షక వర్గాలు పాల్గొంటున్నాయని, ఇప్పటికే వారందరికీ అవగాహన కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగె ఉపేందర్, టీయూసీఐ జిల్లా అధ్యక్షులు గోగర్ల తిరుపతి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తిరుపతి, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీకానంద్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత

ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు నేటి సమ్మెకు సంబంధించి నోటీసును కార్మికులు అందించారు. సమ్మెలో కార్మికులు పాల్గొంటారని ఈ సందర్భంగా నాయకులు కమీషనర్‌కు తెలియజేశారు. అంతకు ముందు నూతనంగా వచ్చిన కమిషనర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరిక శ్రీకాంత్, మాట్ల రాజు, శంకర్, మోతిరం, మల్లేష్, శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీనివాస్, వంశి, ఉదయ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఈ నెల 7 నుండి 14వ తేదీ వరకు ప్రత్యేక స్వచ్ఛ గ్రామ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఈఓ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా స్వచ్ఛ గ్రామ పారిశుద్ధ్య కార్యక్రమంలో కృషి చేసిన పారిశుద్ధ్య కార్మికులు నగేష్, దుర్గమ్మను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపాలనే దేశాభివృద్ధికి మూలస్తంభమని ప్రభుత్వాలు భావించి గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆదేశాల మేరకు ఏడు రోజుల నుండి సిర్పూర్ గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయడం, చెత్తను తీయడం, చెట్లను నాటడం వంటి కార్యక్రమాలు చేశామన్నారు. గ్రామ స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీలో ఏర్పాటుచేసిన చెత్తను తీసుకెళ్లేందు బండి ఇంటికి వస్తుందని, అందులో చెత్తను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచ్, మాజీ వార్డుమెంబర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కౌటాలయ : గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులను ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో కార్మికులకు పులమాలలు వేసి శాలువతో



కౌటలలో కార్మికులను శాలువాలు కప్పి సన్మానిస్తున్న అధికారులు



సిర్పూర్(టి)లో..

సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ మాట్లాడుతూ నిరంతరం పారిశుధ్య కార్మికులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో మురికి కాలువలు శుభ్రమవుతున్నాయని, సానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ఒక రోజు కార్మికులను సన్మానించాలని ఉన్నత అధికారుల ఆదేశానుసారంతో మండలకేంద్రంలోని కౌటాల గ్రామ పంచాయతీలో 15 మంది కార్మికులకు ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, తహసీల్దార్ నస్యుర్ అలీ, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

పెంచికలపేట్ : మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో పల్లెప్రగతిలో భాగంగా ఈ నెల 7 నుండి ప్రారంభమైన పల్లెప్రగతి ముగింపు గ్రామసభలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండలంలోని ప్రత్యేక అధికారులు గంగాసింగ్, రమేష్‌బాబు, వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య సమస్యలు ఎలాంటి సమస్యలైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగానికి క్రమశిక్షణ ఆవశ్యకం

- డీ-మొబిలైజేషన్ పరేడ్‌లో ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్ ఉద్యోగానికి క్రమశిక్షణ అత్యంత ఆవశ్యకమని, సాయిధ బలగాల డీ-మొబలైజేషన్ ద్వారా శారీరక, మానసిక ధృఢత్వం సాధ్యమవుతుందని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో 15 రోజుల నుండి నిర్వహించిన బలగాల డీ-మొబలైజేషన్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గౌరవ వందనం స్వీకరించినంతరం ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. ఈ మొబిలైజేషన్ అద్భుతంగా చేసిన పరేడ్‌ను చూస్తే తమ శిక్షణ రోజులు గుర్తుస్తున్నాయని తెలిపారు. ప్రజల ధనమానప్రాణాలు కాపాడడం, శాంతి భద్రతను పరిరక్షించడం పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యమన్నారు. పోలీస్ సిబ్బంది వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించుకుంటూ వారివారి సర్వీసులలో రివార్డ్స్, అవార్డ్స్ గెలుపొందాలని ఆకాంక్షించారు. నిరంతరం విధులలో ఉండే పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబ, శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లపుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్ కుమార్

అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వరరావు మాట్లాడుతూ 15 రోజులపాటు ఆర్ఐ పెద్దన్న ఆధ్వర్యంలో సిబ్బంది ఇండోర్, ఔట్‌డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్‌లలో ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంటీఓ ఆర్ఐ అంజన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన ప్యానల్ టీం



కేజీబీవీలోని గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ప్యానల్ టీం సభ్యులు

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను గురువారం మండల ప్యానల్ టీం లీడర్ గావుడె హన్మంతు బృందం సభ్యులతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉదయం ఇచ్చే అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల అసెంబ్లీలో పాల్గొని విద్యార్థులకు బోధన తీరును వివరించారు. వంట సామాగ్రి, పప్పులు, బియ్యం, కోడిగుడ్లు, కూరగాయలు, వంట నూనెల తదితర వాటిని పరిశీలించి నాణ్యతలోపం లేకుండా బాలికలకు భోజనం అందించాలని ఎస్ఓకు సూచించారు. పరిసరాలకు సంబంధించిన అంశాలతో పాటు పాఠశాల నిర్వహణ, విద్యార్థినిల ఆరోగ్యం, పౌష్టికాహారం రోజువారీ మెనూతో పాటు పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఇందులో ప్యానల్ టీం సభ్యులు శ్యాంసుందర్, పద్మ, రాకేష్ గుప్తా, రాజాబాబు, సంతోష్, ప్రకాష్, రమేష్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : డీసీసీ అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన కోసం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ అన్నారు. మున్నూరు కాపు సంఘం నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయనకు విన్నవించగా అనంతరం ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పన కోసం తనవతు కృషి చేస్తారని తెలిపారు. ఇదే సందర్భంలో మున్నూరు కాపుల సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసే చర్యలు తీసుకుంటానన్నారు. సంఘం నాయకులు కోరిన సీసీ రహదారులు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేల ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుపొంది, కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమనీ ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు కూడా గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పథకాలను తెలియజేయాలని సూచించారు. ప్రతి పేదోడికి ప్రభుత్వ పథకాలను అందేల కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మిట్ట వెంకన్న, గడ్డల సురేష్, అడప సతీష్, మనిగొండ వెంకన్న, మిట్ట తిరుపతి, మెకర్తి శ్రీనివాస్, గాజుల జక్కయ్య, గుర్రల వెంకన్న, మెకర్తి కషయ్య, బూసి భిమేష్, పెద్దపల్లి శ్రీనివాస్, గడ్డల శంకర్, చిట్ల నారాయణ, మిట్ట పోషన్న, గంధం శంకర్ పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

ఉపాధి హామీ పనులను ప్రారంభించాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలో మంజూరైన సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, గ్రామీణ ఉపాధి హామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని, వర్క్ ఐడీ జనరేట్ చేసి భూవన్ క్యాప్చర్ చేసి మస్టర్ పేమెంట్‌లో పూర్తి చేయాలని, సాంకేతిక పరమైన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పనిని జియో టాకింగ్ చేయాలని, డిమాండ్ అలోకేషన్ చేసి మాస్టర్లను సమర్పించాలని, ఒకే పని రెండు ప్రదేశాలలో చూపిస్తే సాంకేతికంగా సరి చేసుకోవాలన్నారు. మండలాల వారీగా పనుల పురోగతిపై సమీక్షించి ప్రారంభం కానీ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి కంటే ముందే అన్ని పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీరాజ్ ఈఈ, డీఈఈలు, ఈజీఎస్ ఏపీఓలు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలను కాపాడాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలో పెరిగే మొక్కలకు సిబ్బంది పర్యవేక్షించి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని వెంకట్‌రావ్‌పేట్ గ్రామ పంచాయతీలో నర్సరీలను ఇన్‌చార్జి ఎంపీఓ కృష్ణమూర్తితో కలిసి సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మొక్కలకు సరిపడా నీరు పోయాలని, రాబోయే ఎండాకాలంలో మొక్కల రక్షణ కోసం షెడ్లా నెట్‌ను ఏర్పాటుచేసుకోవాలని వారికి సూచించారు. మొక్కల రక్షణ బాధ్యత సిబ్బంది ఉంటుందని, ఎలాంటి నిర్లక్ష్యం చేసిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కార్యాలయంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి సమీక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గోక భూమారెడ్డి, కాల్వ మల్లేష్, కుమ్మరి శంకర్, జువ్వాక్ ఉత్తం, ఎల్మ మోహన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, నాయకులు ప్రకాష్‌రావు, ఎంపీటీసీ వెంకటియాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అశోక్, మైనారిటీ సెల్ అధ్యక్షులు రఫిక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతాప్, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, సాంబశివ్, బాలాజీ, దివాకర్, రామ్‌రెడ్డి, మహేందర్, సుభాష్ యాదవ్, పోశెట్టి పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓగా ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-కుభీర్

కుభీర్ ఎంపీడీఓగా ఎం.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ లింబాద్రి మామడకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలానికి ఎంపీడీఓ ఎం.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా ఎంపికైన ప్రత్యేకాధికారులతో గ్రామంలో ఉన్న సమస్యలను ఎప్పటికపుడు పరిశీలించి, సమస్యలు రాకుండా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సూపరింటెండెంట్ నవనీత్ కుమార్, మండల సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగెల చోరీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని రాగి తీగెలను దొంగలించిన సంఘటన మండలంలోని రామాయి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామం సమీపంలోని బాపురావు చేనులోని 25కేవీ విద్యుత్ నియంత్రికను పగలకొట్టి అందులోని రాగి తీగెలను దొంగిలించారు. దీని విలువ దాదాపు రూ.10వేల వరకు ఉంటుందని ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం వాడీవేడీగా సాగింది. ఎంపీపీ జుమ్డి సౌందర్య ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరిగే అభివృద్ధి పనులు, రానున్న కాలంలో వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎన్ఆర్ఈజీయస్ నిధులు అక్రమంగా పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆమె సూచించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని పలు అధికారులకు సూచించారు. ఈ కార్యమంలో కిష్టాపూర్ ఎంపీటీసీ దుర్గం రాము పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 16, 2024 | www.navatelangana.com

ఉర్దూభవన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తెలంగాణ చౌక్‌లోని ఉర్దూభవన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఉర్దూ భవన్ మేనేజింగ్ కమిటీని ఖాజీల అధ్యక్షుడు ఖాజీ నజీమోద్దిన్, ఆయా మసీదుల కమీటీల ప్రతినిధుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. అధ్యక్షుడిగా షేక్ ముబారక్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షుడిగా షకీర్, సభ్యులుగా సర్దార్, మౌలన అలీ, సదీక్, బబ్లూలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ముబారక్ మాట్లాడుతూ ఉర్దు భవన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉపయోగంలో తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి

నవతెలంగాణ-కుభీర్

గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ అన్నారు. గురువారం మండలంలోని మొల గ్రామ పంచాయతిని సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామ పంచాయతీలో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి పల్లెప్రకృతి, సెగ్రిగేషన్ షెడ్, సానిటేషన్ పనులను పరిశీలించి మాట్లాడారు. సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ పనులను త్వరగా పూర్తి చేసి మొక్కలు పెంచేలా చూడాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్ డీఎల్పీఓ మసుమ్, ఇన్‌చార్జ్ ఎంపీఓ రహీం, ప్రత్యేకాధికారి నవనీత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి హనుమండ్లు, గ్రామస్తులు ఉన్నారు.

శాస్త్రీయ ఆలోచనను అలవర్చుకోవాలి

- విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్
- కళాశాలలో విజ్ఞాన యానం కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భావిభారత పౌరులైన విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనను అలవర్చుకోవాలని, నిజజీవితంలో వినియోగించాలని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ అన్నారు. విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో విజ్ఞానయానం అనే పేరుతో తెలంగాణలోని పలు జిల్లాలలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పట్టణానికి వచ్చిన సందర్భంగా పట్టణంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో సైన్స్ ఎంత అభివృద్ధి చెందుతుందో అంతే స్థాయిలో ప్రజలలో మూఢనమ్మకాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఈ మూఢనమ్మకాలు పేద ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిలో పెరుగుతుండటం విచారకరమన్నారు. ఈ దయ్యాలు, భూతాలు కూడా పేదలకే పడతాయి తప్ప డబ్బున్న వారికి పట్టవని అన్నారు. మూఢనమ్మకాల ప్రభావం మహిళలపై అధికంగా ఉందని వాటిని నిర్మూలించడమే విజ్ఞాన దర్శని ప్రధాన లక్ష్యమన్నారు. ఆ దిశగానే నేడు విజ్ఞాన దర్శని అడుగులు వేస్తుందని తెలిపారు.

సైన్స్ రంగానికి ఫిబ్రవరి నెల చాలా ముఖ్యమైనది

ఫిబ్రవరి సైన్స్ రంగానికి చాలా ప్రాముఖ్యత కలిగిన నెల అన్నారు. ఈ నెలలోనే జాతియ సైన్స్ దినోత్సవం ఫిబ్రవరి 28న ఉందన్నారు. సృష్టి సిద్ధాంతం రాజ్యమేలుతున్న కాలంలో జీవపరిణామాన్ని ప్రతిపాదించిన డార్విన్ జన్మించిన నెల, భూకేంద్ర సిద్ధంతాం అందరూ నమ్ముతున్న కాలంలో సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని చెప్పిన కోపర్నికస్ జన్మించిన నెల, ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చేసి, ప్రయోగాత్మకంగా అనేక ప్రతిపాదనల నిగ్గు తేల్చిన గెలీలియో జన్మినించిన నెల, లక్షల సంవత్సరాలు చీకట్లో మగ్గిన మానవాళికి బల్బ్ కనిపెట్టి వెలుగులు అందించిన ఎడిసన్ జన్మించిన నెల, రసాయనిక విజ్ఞానికి మూలమైన పిరియాడిక్ టేబుల్ రూపకర్త డిమిట్రివ్ మెండలీవ్ జన్మించిన నెల, దేశంలో సైన్స్ అభివృద్ధికి కృషి చెసిన శాంతిస్వరూప్ భట్నాగర్ జన్మించిన నెల, అన్నింటికి మించి సత్యాన్వేషణ కోసం మతోన్మాదుల చేతుల్లో ఆహూతైన బ్రూనో అమరత్వం చెందిన నెల, భారత దేశానికి భారతీయుడిగా ఎకైక నోబెల్ బహుమతి తెచ్చిపెట్టిన రామన్ ఎఫెక్ట్ ను సి.వి.రామన్ ప్రకటించిన నెల, అందుకే విజ్ఞానదర్శిని ఈ నెలను సైన్స్ మాసోత్సవంగా సెలబ్రేట్ చేయాలని అందరికీ విజ్ఞప్తి చేస్తుందన్నారు. దేశంలో సైన్స్‌ను, సైంటిఫిక్ టెంపర్‌ను దెబ్బతీస్తున్న పాలకులు రాజ్యమేలుతున్న తరుణంలో వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రచారం చేయడమే ఈ "విజ్ఞానయానం" లక్ష్యమని అన్నారు. ప్రపంచంలో అత్యంత జనాభా కలిగిన దేశాల జాబితాల్లో మన దేశం మొదటి చోటు దక్కించుకోబోతుందని తెలిపారు. అయితే ఇంత జనాభా ఉన్న మన దేశానికి సైన్స్ రంగంలో భారత దేశానికి భారతీయుడు తెచ్చిన నోబెల్ బహుమతి ఒక్కటి మాత్రమే ఉండటం చాలా బాధాకరమని అందులో కూడా స్వాతంత్ర్యం తరువాత రాకపోవడం గమనార్హమన్నారు. ప్రపంచం మొత్తం అభివృద్ధి వైపు ప్రయాణిస్తుంటే మనం మాత్రం మూఢనమ్మకాల వైపు పరిగెత్తడం శోచనీయమని, మూఢనమ్మకాలను వదిలి విజ్ఞానం వైపు ప్రయాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానదర్శిని సభ్యులు శోభారాణి, మహమ్మద్ అలీ, మహేష్ చిట్టబోయినలు వండర్ సైన్స్ షోనీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్షులు ఎం.స్వామి, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, డైట్ ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ స్వర్ణలత, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం అధ్యక్షులు సంతోష్ పాల్గొన్నారు.

అటవీశాఖ సెక్షన్ అధికారిపై విచారణ



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని మౌలానా నగర్ గ్రామానికి చెందిన షేక్ అలీమోద్దీన్, మునిరోద్దీన్‌లు ఇటీవల జిల్లా కలెక్టర్, అటవీశాఖ అధికారులు కుభీర్ మండల సెక్షన్ అధికారి కోటేష్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో గురువారం జిల్లాస్థాయి అధికారుల ఆదేశాల మేరకు డిజనల్ అధికారుల బృందంతో మౌలానా నగర్‌లో విచారణ చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా డివిజనల్ అధికారి రవీందర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న వ్యవసాయ భూములను 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న అలిమోద్దీన్, మునిరోద్దీన్‌ల వద్ద నుంచి సెక్షన్ అధికారి కొటేష్ డబ్బులు తీసుకున్నరాని ఇద్దరు వ్యక్తులకు వేరువేరుగా తెలిపారు. దీంతో డబ్బులు తీసుకున్న ఏమైనా ఆధారాలు ఉన్నాయని వారికి డివిజనల్ అధికారి అడుగగా మా వద్ద అన్ని రకాల ఆధారాలు ఉన్నాయని కావాలంటే మీకు చూపిస్తామని తెలిపారు. అధికారులు అన్ని రకాల విచారణ జరిపి జిల్లా ఉన్నతస్థాయి అధికారులకు నివేదికలు పంపించడం జరుగుతుందని తెలిపారు. డివిజనల్ అధికారి అలిమోద్దీన్, మినిరోద్దీన్‌కు విడివిడిగా అడగగా అటవీ ప్రాంతంలో ఉన్న భూములను చదను చేయడానికి వచ్చిన ట్రాక్టర్లను అపి పనులను అడ్డుకోవడంతో మా వద్ద నుంచి రూ.5వేలు డబ్బులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓ రమేష్‌రావు, స్పెషల్ పార్టీ బృందం ఆర్షద్, రషీద్‌లు సెక్షన్ అధికారి కోటేష్, గ్రామస్తులు రోహిదాస్, శ్యామ్ ఉన్నారు.

డీఆర్డీఓకు సమ్మె నోటీసు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో ఐకేపీ వీఓఏలు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న కోరారు. గురువారం డీఆర్డీఓ సాయన్నను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు ఉదయం 10 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికులు, కర్షకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని అన్నారు. ఐకేపీ వీఓఏల డిమాండ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కాగా బదిలీపై జిల్లాకు వచ్చిన డీఆర్డీఓ సాయన్నకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో.సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కనుకుంట్ల రాజేష్, దత్తు, జిల్లా ప్రచార కార్యదర్శి దర్శనాల అరుణ్, జిల్లా నాయకులు కినక రాము, అరుణ, సోయం గంగారాం, రమేష్, అరుణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే సంతాప సభలో జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఇటీవల గుండె పోటుతో మరణించగా గురువారం సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సంతాప సభలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ముందుగా రాజమల్లు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధికి రాజమల్లు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఎన్నో ఏండ్లుగా తనతో ఉన్న సంబంధాన్ని గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. రాజమల్లు లేని లోటు తీర్చలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో పాటు ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలంలోని కొల్హారిలో సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా రాథోడ్ తుకారాం బార్య, రాథోడ్ బిక్కు కూతుర్లు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి, అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఉన్నారు.

పండ్ల తోటల పరిశీలన

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రస్తుతం ఉన్న వాతావరణ మార్పుల దృష్ట్యా రైతులు మామిడి, జామ తోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు ఉద్యాన అధికారి (పీహెచ్ఓ) గుడిమల్ల సందీప్ కుమార్ అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీ, శిక్షణా కేంద్రం (హెచ్టీసీ)లో ఉద్యాన నర్సరీల్లో పని చేస్తున్న సాంకేతిక సహాయకులు, సిబ్బందికి పండ్ల తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఉద్యాన నర్సరీలో ఉన్న పండ్ల తోటలను పరిశీలించి, పంటలు నీటి ఎద్దడిని తట్టుకునేలా చర్యలు తీసుకునేలా చూడాలి సూచించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఉల్లి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు ఈ పరిస్థితుల్లో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుధీర్ కుమార్, సాంకేతిక సహాయకులు కుమారి అర్షిత, పూజ పాల్గొన్నారు.



దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లంక రాఘవులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో అనుసరిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల ఫలితంగా ప్రజల జీవనాదాయం పడిపోయి పేదల సంఖ్య పెరిగిపోతున అక్స్‌ఫాం' నివేదిక ప్రకారం దేశంలో 80 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన మగ్గిపోతున్నారన్నారు. 2024 ఏప్రిల్‌లో రాబోతున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర మోడీ ప్రభుత్వం తిరిగి రాయితీలను ప్రకటిస్తూ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. చారిత్రాత్మకమైన రైతాంగ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 3 వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు రాతపూర్వకంగా హామీలు ఇచ్చిందని ఈ కాలంలో వాటిని అమలు చేయకపోగా వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకున్నదన్నారు. సహకార రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నదన్నారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించలేదని ఆందోళన సందర్భంగా చనిపోయిన 750 రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదన్నారు. వామపక్షాల ఒత్తిడి వల్ల వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చేందుకు పూనుకుంటున్నదని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర గ్యారంటీ చేసే చట్టం చేయాలన్నారు. పేద, మధ్యతరగతి రైతులందరికి కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలని 60 ఏండ్లుగా పైబడిన అందరికీ పెన్షన్ ఇవ్వాలన్నారు. కేంద్ర హోంమంత్రి అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా మార్చాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు-2022ను ఉపసంహరించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు అందరికీ చెల్లించాలని అన్నారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధిహామి చట్టాన్ని విస్తరించి, పని రోజులను 200కు పెంచాలన్నారు. రోజుకు రూ.8వందలు కనీస వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని వేతనాలు చెల్లించాలని, జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి స్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, బీఆర్ఎస్ రైతు సంఘం నాయకులు నారాయణ, నాయకులు ఆశన్న పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధిపర్చాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధికి నోచుకోలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం అసెంబ్లీలో ఖానాపూర్ నియోజవర్గ సమస్యలపై మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని దోడందా గట్టేపల్లి లాంటి అనేక మారుమూల గ్రామాలలో నీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తి స్థాయిలో విఫలమైందన్నారు. గతంలో కడెం ప్రాజెక్టు డేంజర్ జోన్‌లోకి వెళితే అప్పటి ప్రభుత్వం ఏం చేయలేకపోయిందన్నారు. కేటీఆర్‌కు కడెం ప్రాజెక్టు ఎక్కడ ఉందో తెలియకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే కడెం ప్రాజెక్టు మరమ్మత్తులకు రూ.5 కోట్ల 46 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆదివాసుల కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలను కాపాడుతూనే గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు పాహనీలు ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెన్యూవల్ రోడ్లకు ఫారెస్ట్ అధికారులు ఆపడం, కట్టెలు తీసుకురావడానికి వెళ్తున్న వారిపై కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఉట్నూరు మండల కేంద్రంలో జిల్లా ఆస్పత్రిని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మదర్ చైల్డ్ హాస్పిటల్‌ను ఉట్నూర్ కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. డీఎడ్ ఎదావిదిగా కొనసాగించాలని, బీఎడ్ కళాశాలలో పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమాకాలను చేపట్టాలని కోరారు. కడెం, చిక్‌మన్, మత్తడి లాంటి ప్రాజెక్టులను పూడికలు తీసి ఆధ్వనంగా మార్చారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలను మెరుగుపర్చాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా ప్రజలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటారన్నారు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని తెలిపారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి

- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఫసియోద్దీన్



నవతెలంగాణ-దిలావర్‌పూర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న, కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక, మతతత్వ విధానాలను ప్రతిఘటించాని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఫసియోద్దీన్, పోశెట్టి పిలుపునిచ్చారు. గురువారం నిర్మల్ పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తి అయిన రైతాంగ, కార్మికవర్గ, ప్రజల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి తుంగలో తొక్కారని అన్నారు. శ్రామికుల నిజ వేతనాలు ఇరవై శాతం తగ్గిపోయాయని విమర్శించారు. అధికారానికి రాకముందు ధరలను నియంత్రిస్తామని చెప్పిన బీజేపీ ఇప్పుడు విచ్చలవిడిగా ధరలు పెంచిందని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నియంత్రించలేక పోయారని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేటర్లకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ నాయకులు రాజేశ్వర్, నర్సారెడ్డి, అతీక్, షబ్బీర్, శాఖకార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-నార్నూర్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సేవాలాల్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, భీంపూర్, మహాగావ్, మలంగి, ఎంపల్లి, నాగల్‌కొండ, సుంగాపూర్, చోర్‌గావ్‌తో పాటు ఆయా గ్రామాల లంబాడి తండాలో నాయక్ కారోబారి, గ్రామ పెద్దలు సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తండాలో సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి భోగ భండార్ పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ సమాజానికి ఆధ్యాత్మిక మార్గాన్ని పరిచయం చేశారని, ఆయన చూపిన మార్గంలో పయనించి సమాజ జాగృతిని కృషి చేస్తామని అన్నారు. జీవితంలో సామాజిక ఆధ్యాత్మిక మార్గాలు ముఖ్యమని సూచించారు.

పాఠశాలలో సేవాలాల్ మహారాజ్ జయంతి..

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని సేవాదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల కరెస్పాండెంట్ జాదవ్ ఉమాజీ, ఉపాధ్యాయ సిబ్బంది గ్రామ పెద్దలతో కలిసి సేవాలాల్ మహారాజ్ జయంతినీ ఘనంగా నిర్వహించారు. గ్రామ సేవాలాల్ కమిటీ అధ్వర్యంలో గ్రామంలో సేవాలాల్ పల్లకీ శోభాయాత్ర నిర్వహించారు. సంస్కృతి, సాంప్రదాయాల బద్దంగా మహిళలు, యువకులు, భక్తి పాటలపై నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, ఎంపీటీసీ పరమేశ్వర్, యశ్వంత్‌రావ్, శివాజీ పటేల్, మాజీ సర్పంచ్ మధుకర్ రాథోడ్, మాజీ ఉపసర్పంచ్ విష్ణు, మహేందర్, గ్రామ పెద్దలు బాబు జాదవ్, నాయక్ తానాజి రాథోడ్, దినేష్ రాథోడ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే సాధన కమిటీ దీక్షలు

- 31వ రోజు దీక్షకు పద్మశాలి సంఘం మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వెనకబడిన ఆదిలాబాద్ అభివృద్ధి చెందాలంటే రవాణ సౌకర్యం మెరుగు కావాల్సిన అవసరం ఉందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ అన్నారు. ఆర్ అండ్ బీ ఎదుట ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్ష 31వ రోజుకు చేరుకుంది. గురువారం దీక్షలో పద్మశాలి సంఘం సభ్యులు కూర్చోని, రైల్వేలైన్ సాధించే వరకు పోరాడుతామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ మాట్లాడుతూ వెనకబడిన ఆదిలాబాద్‌ను ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. దానికి కారణంగా అభివృద్ధి చెందడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ వెళ్లలంటే 8 నుంచి పది గంటల సమయం పడుతుందన్నారు. అదే ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ వేస్తే మూడు నుంచి నాలుగు గంటల సమయంలో హైదరాబాద్ చేరుకోవచ్చని తెలిపారు. రవాణ సౌకర్యం లేని కారణంగా ఆదిలాబాద్‌కు వైద్యులు, పరిశ్రమలు రావడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సాధన సమితి చైర్మెన్ నారాయణ, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు శంకరయ్య, వెంకన్న, కోశాధికారి బాస దత్తు, మేకల నర్సింగ్‌రావు, చిప్ప గంగన్న, అనుముల ఉశన్న, పోశెట్టి, జక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎండీ ఖమర్ అహ్మద్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నూతన మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పట్టణాభివృద్ధికి కౌన్సిలర్ల సహకారంతో తన వంతు కృషి చేస్తానని కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. ట్యాక్సల చెల్లింపులు జరిగేలా కౌన్సిలర్‌లు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి సతీష్, అంబకంటి అశోక్, భారత్, వెంకన్న, అశోక్ స్వామి, డాక్టర్ లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.